
పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 8లో..
8లో.. రామగుండంలో భానుడు భగభగ



తెరపైకి స్థానికత

- పెద్దపల్లిలో విస్తృత ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ
- ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కాంగ్రెస్ నేతలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో స్థానికత అంశం తెరపైకి బలంగా వస్తున్నది. స్థానికులనే పార్లమెంట్‌కు పంపించాలని, అలా అయితేనే సమస్యలు పరిష్కారం అవుతాయంటూ బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన అభ్యర్థులు కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గొమాసే విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో అనేక మంది వివిధ పార్టీల నుంచి స్వతంత్రులుగా పోటీ పడుతున్నప్పటికీ ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్యనే పోటీ నడుస్తున్నది.

పెద్దపల్లి పార్లమెంట్ ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరగగా, ప్రస్తుతం 18వసారి ఎన్నికలు జరుగుతున్నాయి. 1998, 1999లో జరిగిన ఎన్నికల్లో మంథని కోడలు అయిన డాక్టర్ సి సుగుణ కుమారి, 2019లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన బొర్లకుంట వెంకటేశ్ నేత స్థానికులు కావడం గమనార్హం. 14 సార్లు స్థానికేతరులే ఇక్కడి నుంచి పోటీ చేసి గెలుపొందారు. వివిధ పార్టీల నుంచి స్థానికులు పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. ప్రస్తుతం జరుగుతు న్న ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీ చేస్తున్నారు. ఆయనది పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామం. ఆయన సింగరేణి కార్మికుడిగా పని చేయడమే కాకుండా పాత మేడారం నుంచి 2004, 2008 ఎన్నికల్లో, కొత్తగా ఏర్పడ్డ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2009, 2010, 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో వరుస విజయాలు సాధించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందారు.

2009లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి 49 వేల ఓట్ల తేడాతో ఓటమి చెందిన శ్రీనివాస్ గొమాసే ప్రస్తుతం బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. ఆయనది మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం కావడం గమనార్హం. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణ హైదరాబాద్‌కు చెందిన వారు. మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి ఇక్కడి నుంచి 1989, 1991, 1996, 2004 ఎన్నికల్లో నాలుగు పర్యాయాలు గెలుపొందారు. ఆయన వారసత్వంగా రాజకీయాల్లో వచ్చిన వివేక్ 2009లో ఇక్కడి నుంచి ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుతం ఆయన కుమారుడు వంశీకృష్ణకు పార్టీ టిక్కెట్ ఇచ్చింది. ఈ ప్రాంత వాసులతో వెంకటస్వామి తర్వాత వారి కుటుంబసభ్యులకు విస్తృత పరిచయాలు ఉన్న దృష్ట్యా పార్టీ వంశీకృష్ణకు టిక్కెట్ ఇచ్చింది. వంశీకృష్ణ స్థానికేతరుడు అని, వాళ్ల గెలిస్తే ప్రజలకు అందుబాటులో ఉండరని, స్థానికులనే గెలిపించాలని, ఎల్లవేళలా తమకు అందుబాటులో ఉంటామంటూ ఓటర్లను ఆకర్శించే ప్రయత్నం చేస్తున్నారు.

● అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్..

గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ధర్మపురి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు నల్లేరు మీద నడకేనని భావిస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తుండగా, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండు పర్యాయాలుగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, హిందుత్వం గురించి చెప్పుకుంటూ పోతు న్నారు. పనిలోపనిగా స్థానికత అంశాన్ని తెరపైకి తీసుకు వచ్చారు. పెద్దపల్లి పార్లమెంట్ ఏర్పాటైన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ స్థానికులకు టిక్కెట్ ఇచ్చిన దాఖలాలు లేవని 1989, 1991, 1996, 1998, 1999, 2004 ఎన్నికల్లో గడ్డం వెంకటస్వామి పోటీ చేశారని, ఆ తర్వాత 2009, 2014 గడ్డం వివేక్‌కు, ఇప్పుడు ఆయన కుమారుడు వంశీకృష్ణకు ఆ పార్టీ టిక్కెట్ ఇచ్చిందని, ఒకే కుటుంబంలో ముగ్గురికి తొమ్మిది పర్యాయాలు టిక్కెట్ ఇచ్చిందని, స్థానికులు పార్లమెంట్‌లో ఈ ప్రాంత ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యల గురించి ప్రస్తావించ వద్దా అని ప్రచారం చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో క్లీన్ స్వీప్ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ ఎన్నికను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. వ్యూహ, ప్రతి వ్యూహంలో భాగంగా బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు స్థానికత అంశాన్ని తీసుక వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అయితే ఎవరెన్ని వ్యూహాలు పన్నినా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ నాయకులు అంటున్నారు.

రూ. కోటి ఆరు లక్షలకు పైగా నగదు జప్తు

- పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన తనిఖీలలో ఇప్పటి వరకు కోటి ఆరు లక్షల 62 వేల 92 రూపాయలను జప్తు చేసి, వీటిలో 92 లక్షల 46 వేల 402 రూపాయలను విడుదల చేసినట్లు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో తొమ్మిది లక్షల 85 వేల 850 రూపాయలు సీజ్ చేశామని, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 6 లక్షల 81 వేల 830 రూపాయలు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించి మూడు లక్షల ఎనిమిది వేల 990 రూపాయలు విడుదల చేశామని అన్నారు. పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 10 లక్షల ఐదు వేల 500 రూపాయలు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించి పూర్తి స్థాయిలో సీజ్ చేసిన సొమ్ము విడుదల చేశామని తెలిపారు. ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 25 లక్షల 66 వేల 710 రూపాయలు నగదు, 28 వేల 600 రూపాయల విలువ గల 80 చీరలు సీజ్ చేయగా, సరైన ఆధారాలు పరిశీలించి 25 లక్షల తొమ్మిది వేల 710 రూపాయలు, 80 చీరలను విడుదల చేశామని తెలిపారు. చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఐదు లక్షల 49 వేల 200 రూపాయలు, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 37 లక్షల 45 వేల 272, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 11 లక్షల 27 వేల 730 రూపాయలు సీజ్ చేయగా, ఆధారాలు పరిశీలించిన గ్రీవెన్స్ కమిటీ పూర్తి స్థాయిలో నగదును విడుదల చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా సీజ్ చేసిన నగదు కోటి ఆరు లక్షల 62 వేల 92 రూపాయలలో సరైన ఆధారాలు పరిశీలించి గ్రీవెన్స్ కమిటీ 92 లక్షల 46 వేల 402 రూపాయలను విడుదల చేసినట్లు, సరైన ఆధారాలు సమర్పించని కారణంగా 14 లక్షల 15 వేల 690 రూపాయలు విడుదల చేయలేదని ముజమ్మిల్ ఖాన్ ప్రకటనలో తెలిపారు.

ప్రశాంతంగా ఆర్‌జేసీ, ఆర్‌డీసీ ప్రవేశ పరీక్ష

- పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన అదనపుకలెక్టర్

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 28: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన మహాత్మ జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పెద్దకల్వలలో గల డిగ్రీ కళాశాల కేంద్రాన్ని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ జూనియర్, రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల నిమిత్తం నిర్వహిస్తున్న కామన్ ఎంట్రెన్స్ పరీక్షను పెద్దపల్లి జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1,263 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు రిజిస్టర్ చేసుకోగా, 1,140 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, 123 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి పరీక్ష కేంద్రం వద్ద డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను నియమించి పారదర్శకంగా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో ఆయన వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడిగా ఉమామహేశ్వర్



కాల్వ శ్రీరాంపూర్, ఏప్రిల్ 28: తెలంగాణ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా కాల్వ శ్రీరాంపూర్ వేద వ్యాస పాఠశాలకు చెందిన కరస్పాండెంట్ జూపాక ఉమామహేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు సహకరించిన ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు, జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డికి ఉమామహేశ్వర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాన రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలి

మంథని, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని పెద్దపల్లి ఎంపీగా పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి బూడిద తిరుపతి ఆదివారం కోరారు. ప్రజలను మరోమారు మోసం చేయటానికి అభూత కల్పన హామీలు, ప్రలోబాలతో ముందుకు వస్తున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని ఆదరించాలి

మంథని, ఏప్రిల్ 28: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలను చూసి పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణను మంథని నియోజకవర్గంలోని ప్రజలంతా ఆదరించి ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వం జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి చూడాలన్నారు. గతంలో పెద్దపల్లి ఎంపీగా కాకా, వివేక్‌లు చేసిన ప్రజాసేవను దృష్టిలో ఉంచుకొని వంశీకృష్ణను ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు.

మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

అంతర్గాం, ఏప్రిల్ 28: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అంతర్గాం మండల కార్యదర్శి కొల్లూరి మల్లేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ అంతర్గాం మండల కేంద్రంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేకవిధానలు అవలంబిస్తుందని ఆరోపించారు. 44కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన బీజేపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో రైతు, కార్మికవర్గాలు బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు అరుముళ్ల తిరుపతి, బొంతు ఆనంద్, సారయ్య, మల్లేష్, కుమార్ పాల్గొన్నారు.

జోరుగా పేకాట

- రామగుండం, చెన్నూర్ కేంద్రంగా కంపెనీలు
- లాడ్జీలు, హోటళ్లలో డెన్‌లు...
- ఒక్కో గదికి రోజుకు రూ.20వేల-రూ.30వేల వసూళ్లు
- లాడ్జీల్లో పేకటరాయుళ్లకు ఫైనాన్స్, రూ.10చొప్పున వడ్డీ
- ఎన్‌టీపీసీలోని ఒక లాడ్జి నెలవారీ లీజు రూ.8లక్షలు
- జూదంతో సర్వం కోల్పోతున్న కార్మికులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 28: పేకాట వ్యాపారమైంది... కొందరు దీన్నే వ్యాపారంగా మార్చుకుని ప్రతి రోజు లక్షలు దండుకుంటున్నారు... కోల్‌బెల్ట్‌లో ఉద్యోగులు మొదలుకుని చిరు వ్యాపారుల వరకు దీనికి బానిసలుగా చేస్తున్నారు... వ్యాపార విస్తరణకు బ్రోకర్లను పెట్టుకుని కమీషన్లు ఇస్తూ జూదరులను పోగేస్తున్నారు. పేకాట స్థావరాల్లోనే ఫైనాన్స్‌లు పెట్టి అక్కడే రుణాలు ఇస్తూ 10శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. గోవా స్థాయిలో కంపెనీలు పెట్టి చిప్స్‌ను మనుగడలోకి తీసుకువచ్చారు. లాడ్జీలు, హోటళ్లను డెన్‌లుగా మార్చుకుని రాత్రి పగలు తేడా లేకుండా దందా నిర్వహిస్తున్నారు. సాధారణంగా రూ.1500లకు అద్దెకు ఇచ్చే గదులకు పేకాట నిర్వహిస్తూ రోజూ రూ.30వేల వరకు దండుకుంటున్నారు. లక్షల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. దీనికి బానిసైన జూదర్లు మాత్రం సర్వస్వం కోల్పోయి రోడ్డున పడుతున్నారు.

● లాడ్జీల్లో లక్షల వ్యాపారం..

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని పలు లాడ్జీలు పేకాట కేంద్రాలుగా మారాయి. సాధారణంగా కస్టమర్లకు గదులు అద్దెకు ఇస్తే కిరాయి గదుల సౌకర్యాలను బట్టి వెయ్యి నుంచి రూ.2వేల వరకు ఉంటుంది. కానీ పేకాట నిర్వహిస్తే ఒక్కో గదికి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు రోజూ గిట్టుబాటు అవుతుంది. గోదావరిఖని, ఎన్‌టీపీసీ ప్రాంతాల్లోని కొన్ని లాడ్జీలు పేకాటకు కేరాఫ్‌గా మారాయి. ఎన్‌టీపీసీలోని ఒక లాడ్జీ అయితే పేకాట క్లబ్ అనే పేరుగా మారింది. మంచిర్యాల, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి పేకాట రాయుళ్లు, వ్యాపారులు లక్షల రూపాయలతో ఈ లాడ్జికి వచ్చి పేకాట ఆడుతారనేది బహిరంగ రహస్యం. రైడ్స్ ఫ్రీ లాడీగా దీనికి పేరున్నది. ఎన్‌టీపీసీలోని ఒక లాడ్జికి లీజే నెలకు రూ.8లక్షలు ఉందంటే పేకాటపై సంపాదనను అంచనా వేసుకోవచ్చు. ఇటీవల కాలంలో గోదావరిఖని, ఎన్‌టీపీసీ ప్రాంతాల్లోని లాడ్జీలపై టాస్క్‌ఫోర్స్ దాడులు చేస్తే లక్షల రూపాయల నగదు పట్టుబడింది.

● గోవా స్థాయిలో కంపెనీలు... వినియోగంలోకి చిప్స్

గోవా కెసినో స్థాయిలో కోల్‌బెల్ట్‌లో పేకాట కంపెనీలను ఏర్పాటు చేశారు. గోదావరిఖని, చెన్నూరు, ఎన్‌టీపీసీ ప్రాంతాలకు చెందిన కొంద రు వ్యక్తులు గ్రూపులుగా ఏర్పడి 'కంపెనీలు'లు పెట్టుకున్నారు. ఒక్కో కంపెనీకి రూ.50లక్షల నుంచి రూ.70లక్షలు పెట్టుబడులు పోగేసుకు న్నారు. పలువుర ప్రజాప్రతినిధులు, మద్యం వ్యాపారులు సైతం ఈ కంపెనీలలో భాగస్వామ్యులుగా ఉన్నారు. వ్యాపారంలో సేల్స్‌మెన్ స్థాయి లో జీతాలు ఇచ్చి జూదర్లను పోగు చేసేందుకు ఆర్గనైజర్లను పెట్టుకున్నా రు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆసిఫాబాద్ ప్రాంతాల నుంచి వ్యాపారులు, ఉద్యోగులను పోగు చేసి పేకాట ఆడించడం ఈ కంపెనీల పని. జూదర్లు ముందుగానే నగదును కంపెనీలకు అప్పగిస్తే దానికి విలువైన సమానమైన చిప్స్‌ను ఇస్తారు. రూ.10వేలు, రూ.20వేలు, రూ.20వేలకు సంబంధించిన చిప్స్ ఉంటాయి. వీటితో పేకాట నిర్వహిస్తారు. ఒక్కో గేమ్‌కు ఆటను బట్టి నిర్వాహకులకు జూదర్లు సొమ్ములు చెల్లించాల్సి ఉంటుంది. సుందిళ్లలో టాస్క్‌ఫోర్స్ దాడులతో ఈ కంపెనీల దందా వెలుగుచూసింది. చెన్నూరు సమీపంలోని ఆస్నాద్ శివారుల్లో జరిగిన దాడుల్లో రూ.14.5లక్షలు పట్టుబడ్డాయి. కంపెనీల నెట్‌వర్క్ వివిధ జిల్లాల్లో కొనసాగుతున్నట్టు వెలుగులోకి వచ్చింది.



పేకాట స్థావరంలో పట్టుబడిన నగదు, చిప్స్



పేకాట స్థావరంలో లభించిన చిప్స్‌ను చూపిస్తున్న సీపీ శ్రీనివాస్

● స్థావరాల వద్దే ఫైనాన్స్‌లు..

పేకాట స్థావరాల వద్దే నిర్వాహకులు జూదరులకు ఫైనాన్స్ ఇస్తున్నారు. ఏటీఎం కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లు, భూములకు సంబంధించిన పత్రాలు దగ్గర పెట్టుకుని జూదరుల స్థాయిని బట్టి రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు ఫైనాన్స్ ఇస్తున్నారు. రూ.100కు వారానికి రూ.10చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారు.

పేకాట వ్యాపారుల స్వార్థానికి ఎందరో బాధితులు రోడ్డున పడుతున్నారు. సింగరేణి ఉద్యోగులే ఇందులో ప్రధాన బాధితులుగా ఉంటున్నారు. ఇటీవల పోలీస్ దాడుల్లో పట్టుబడిన వారిలో సింగరేణి ఉద్యోగులు, చిరు, మధ్యతరహా వ్యాపారులే ఎక్కువగా ఉన్నారు.

● పేకాటపై సీపీ నజర్...

పేకాట వ్యాపారంపై రామగుండం సీపీ, ఐజీ ఎం శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో ఖాకీలకు తెలిసి 'ఆట' సాగుతుందనే ప్రచారానికి దాడులతో ఫుల్‌స్టాప్ పెట్టారు. టాస్క్‌ఫోర్స్‌తో దాడులు చేయించడం ద్వారా జూదర్లను కట్టడి చేస్తున్నారు. శ్రీనివాస్ బాధ్యత చేపట్టిన తరువాత 27 కేసుల్లో 184 మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.22.15లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాటను కట్టడి చేసేందుకు జూదర్లే కాకుండా లాడ్జీల యజమానులు, లీజుదారులు, నిర్వాహకులపై సైతం కేసులు నమోదు చేస్తున్నారు. చెన్నూరులో నిర్వాహకులపై కేసులు నమోదు చేసిన పోలీసులు రెండు రోజుల క్రితం ఎన్‌టీపీసీలో ఒక లాడ్జిలో పేకాట దందా వెలుగు చూడగా లాడ్జీ యజమాని, నిర్వాహకులపై సైతం కేసు నమోదు చేశారు.

మానేరు నుంచి ఇసుక తరలింపును అడ్డుకుంటాం

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

సుల్తానాబాద్, ఏప్రిల్ 28: మానేరు పరివాహక ప్రాంత గ్రామాల నుంచి లారీల ద్వారా ఇసుక తరలింపును అడ్డుకుని తీరతామని ఎమ్మెల్యే విజయరమణారావు స్పష్టం చేశారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రినగర్‌లో ఆదివారం ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ తరపున ఎమ్మెల్యే విజయరమణారావు ఇంటింటికి వెళ్లి చేతి గుర్తుపై ఓటు వేసి గడ్డం వంశీని గెలిపించాలని కోరారు. ప్రచారం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతు మన మానేరు.. మన ఇసుక అంటూ మానేరును పరిరక్షించుకోవా ల్సిన అవసరం మనందరిపై ఉందని అన్నారు. లారీల ద్వారా మానేరు నుంచి ఎవరు ఇసుక తరలించినా చట్టపర మైన చర్యలు, కేసులు తప్పవని హెచ్చరించారు. మన వారు బయట వారు అనే తేడా లేకుండా ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని స్వయంగా అధికారులను ఆదేశించామన్నా రు. మానేరు సమీప గ్రామాల ప్రజలు ఇసుకను ఎలాంటి పన్ను చెల్లించకుండా స్థానిక అవసరాలకు ఉచితంగా తీసుకోవచ్చని అన్నారు. క్వారీల నుంచి లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించే పద్ధతిని నిలిపివేయాలని సీఎంను కోరతానన్నారు. మానేరు నుంచి ఇసుకను ఎవరు తరలించినా ఉపేక్షించేది లేదన్నారు. తాను స్థానికులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవడం మూలంగా గతంలో ఒక ఇసుక ట్రాక్టర్ సుల్తానాబాద్‌కు రావాలంటే 2700 చెల్లించే వారని ప్రస్తుతం కేవలం ఎనిమిది వందల నుంచి వేయి రూపాయలకే ట్రాక్టర్ ఇసుక లభిస్తుందన్నారు. శాస్త్రినగర్ వాసులకు మున్సిపల్ పరంగా ఎదురయ్యే ఇబ్బందులను తాను కమిషనర్‌తో మాట్లాడి పరిష్కరిస్తానని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ సుల్తానాబాద్ పట్టణ ప్రాంతం వారికి కూడా ఉపాధిహామీ పనులు కల్పిస్తామన్నారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి అనేకసార్లు ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా పనిచేసి పెద్దపల్లి ప్రాంత అభివృద్ధికి పాటుపడిన వెంకటస్వామి మనవ డు, మాజీ ఎంపీ వివేక్ కుమారుడైన గడ్డం వంశీని గెలిపించాలని ఎమ్మెల్యే ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఐదింటిని నెరవేర్చామన్నారు. మిగతావి ఎన్నికల అనంతరం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకు లు సాయిరి పద్మ మహేందర్, మినుపాల ప్రకాష్ రావు, అంతటి అన్నయ్య గౌడ్, దామోదర్ రావు, పన్నాల రాములు, గాజుల రాజమల్లు, శ్రీగిరి శ్రీనివాస్, అబ్బయ్యగౌడ్, బిరుదు క్రిష్ణ, పూల రాజు, రాజలింగం, తిరుపతి, బండ గోపాలు తిరుపతి లచ్చయ్య, వెంకటేశం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

● కాంగ్రెస్‌లో పలువురి చేరిక..

సుల్తానాబాద్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కందునూ రిపల్లి, చిన్నకలువల తాజా మాజీ సర్పంచులు పన్నాల తిరుపతి, ఏరుకొండ రమేష్, నారాయణరావుపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ అధికారి నారాయణ గౌడ్, చిన్నబొం కూరు గ్రామానికి చెందిన చారితో పాటు పలువురు నాయకు లు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే విజయరమణా రావు కండువాలు కప్పి స్వాగతం పలికారు.

వాహనాల తనిఖీ

మానకొండూర్, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఆదివారం మానకొండూర్‌లో సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. తూర్పు దర్వాజ బస్టాండ్ వద్ద జమ్మికుంట నుంచి కరీంనగర్ వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహక రించాలని కోరారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు డబ్బు తీసుకెళ్తున్న వారు ఆధారాలు ఉంచుకోవాలని చెప్పారు. 50వేల రూపాయలకు మించి తీసుకెళితే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వాహనదారుడి మృతి


హేమంత్(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 28: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి సంతోష్‌నగర్‌లో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెరుక హేమంత్(22) మృతి చెందాడు. శనివారం అర్ధరాత్రి బస్సుకు హైద్రాబాద్‌కు వెళ్లాల్సిన మిత్రుడికి వీడ్కోలు పలికేందుకు హేమంత్ మిత్ర బృందం షిర్కే బస్టాప్‌కు వెళ్లారు. అక్కడ వేరే మిత్రుడి వాహనాన్ని తీసుకున్న హేమంత్, మణికంఠలు సంతోష్‌నగర్ వైపు వెళ్లారు. ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కరెంట్ పోల్‌ను బలంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో హేమంత్ తల, మొహంపై బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనకాల ఉన్న మణికంఠ గాయపడ్డాడు. కాగా 25 రోజుల క్రితమే హేమంత్ సింగరేణిలో ఉద్యోగం సాధించాడు. కారుణ్య నియామకాల కింద హేమంత్ తండ్రి శంకర్ మెడికల్ ఇన్వాలిడేషన్ అవడంతో యాజమాన్యం 25 రోజుల క్రితం వకీల్‌పల్లె గనిలో పోస్టింగ్ ఇచ్చింది.

హార్వెస్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులో శనివారం రాత్రి హార్వెస్టర్ ఢీకొన్న సంఘటనలో గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన గాజులపల్లి ముత్యం తీవ్ర గాయాలపాలయ్యాడని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన మహారాష్ట్రకు చెందిన హార్వెస్టర్ డ్రైవర్ రాంనేని రాజబాపుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ముత్యం తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బొప్పాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న హార్వెస్టర్ ముత్యం బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు.

కాగితాలకే పరిమితమైన అటవీ ప్లాంటేషన్

● ప్లాంటేషన్ లేకున్నా మొక్కల కాపాలాదారు..?
● అధికారి తీరుతో ప్రభుత్వ ఖజానా పక్కదారి?

కోనరావుపేట, ఏప్రిల్ 28: కోనరావుపేట మండలం శివంగలపల్లి బీట్ పరిధిలో అటవీ ప్లాంటేషన్ కాగితాలకే పరిమితమైందనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారి తీరుతో ప్రభుత్వ ఖజానా పక్కదారి పడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. నాటిన మొక్కలను సంరక్షించకపోయినా సంరక్షిస్తున్నట్టు ఉన్నతాధికారులను నమ్మిస్తూ కాగితాలకే ప్లాంటేషన్‌ను పరిమితం చేసి ప్రభుత్వం నుంచి నిర్వహణ ఖర్చు చేస్తున్నామని బిల్లులు తీసుకుంటూ, వాచ్‌మన్ పేరు మీద బిల్లు పొందుతూ ఓ అటవీశాఖ అధికారి నిధులు కాజేస్తున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. కోనరావుపేట మండలం శివంగలపల్లి బీట్ పరిధిలో 2022-23 సంవత్సరంలో కంపార్ట్మెంట్ నెంబర్ 176/3లోని 41 హెక్టార్లను ప్యాచ్ 1 ప్యాచ్ 2 ప్యాచ్ 3 మూడు భాగాలుగా ఏర్పాటు చేసి అందులో సుమారు 11 వేల మొక్కలను అటవీశాఖ అధికారులు నాటారు. కానీ అందులో నాటిన ఏ ఒక్క మొక్కను కూడా అధికారులు సంరక్షించలేదు. అందులో లేని మొక్కలు ఉన్నాయంటూ వాటి నిర్వహణకు ఖర్చులు ప్రభుత్వం నుంచి పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మొక్కలు ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేశాం

- బాపు రాజు, వెంకటాపూర్, సెక్షన్ అధికారి



ఫారెస్టు పరిధిలోని 25 ఎకరాల్లో ప్లానిటేషన్ చేశాం. కొంత మంది భూములు ఆక్రమించుకుంటూ ఇవి మా భూములేనని పెట్టిన మొక్కలను ధ్వంసం చేశారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేశాం. ఆ భూములను కాపాడడానికి వాచర్‌ను నియమించాం. ప్రతి సంవత్సరం మొక్కలు నాటుతున్నాం. కొంత మంది భూమిని ఆక్రమించుకు నేందుకు ప్రయతిస్తూ మొక్కలను ధ్వంసం చేస్తున్నారు.


మొక్కలు నాటినట్లు చూపుతూ ఏర్పాటు చేసిన బోర్డు

రాజన్న క్షేత్రంలో భక్తుల సందడి

వేములవాడ, ఏప్రిల్ 28: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం, శ్రీ భీమేశ్వరాలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పీడీఎస్‌యూ రాష్ట్రకోశాధికారిగా రత్నం రమేష్ ఎన్నిక


రత్నం రమేష్

భగత్‌నగర్, ఏప్రిల్ 28: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర కోశాధికారిగా రత్నం రమేష్ ఎన్నికయ్యారు. కొత్తగూడెంలో ఈ నెల 27న జరిగిన పిడిఎస్‌యు రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రత్నం రమేష్‌ను రాష్ట్ర కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రత్నం రమేష్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి సంఘం పట్ల అంకిత భావంతో విద్యార్థి ఉద్యమాలను ఉదృతం చేసి సమస్యల పరిష్కారానికి, సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

సీపీఐ నాయకుడు సామల మల్లేశం మృతి

● సంతాపం తెలిపిన వివిధ పార్టీల నాయకులు


సామల మల్లేశం(ఫైల్)

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 28: కార్మికవర్గం పక్షాన అలుపెరుగని పోరాటాలు, ఉద్యమాలు చేసిన సీపీఐ సీనియర్ నాయకుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం(80)వృద్ధాప్యం, అనారోగ్యంతో కన్నుమూశాడు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీవై నగర్ స్వగృహంలో మల్లేశం పార్థీవదేహం ఉంచారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరమారావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌లు సంతాపం తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి సీపీఐ పార్టీ జెండా, పూలమాలలను మల్లేశం పార్థీవదేహంపై ఉంచి నివాళులర్పించారు. పవర్‌లూం, బీడీ పరిశ్రమకు నిలయమైన సిరిసిల్లలో మూడు దశాబ్దాల పాటు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మల్లేశం పోరాటాలు చేశారని వారు పేర్కొన్నారు. సిరిసిల్ల రాయిని చెరువులో వేలాది మంది నిరుపేదలను సమీకరించుకొని పోరాటాలు చేసి వేల మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించారన్నారు. మల్లేశం మరణం సీపీఐ పార్టీకి తీరని లోటని అన్నారు. మల్లేశంకు భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాల జాతర


జగ్గసాగర్‌లో నృత్యాలు చేస్తున్న పోతరాజులు


అప్పారావుపేటలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో పోచమ్మ బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. జాతర కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు అమ్మ వారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేశారు. బోనాలను నెత్తిన ఎత్తుకొని పోతురాజుల నృత్యాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయంకు చేరుకున్నారు. భక్తులు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మ వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలోగౌడ కులస్థులు, భక్తులు పాల్గొన్నారు.

● కొడిమ్యాల: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో ఆదివారం పెద్దమ్మ బోనాల పండగను ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు ఇంటికొక్క బోనం నెత్తిన పెట్టుకొని ఆలయానికి డప్పు చప్పుళ్లతో వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పిల్లా పాపలను చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘం నాయకులు గరిగంటి పర్వతాలు, ఎడ్ల కొమురయ్య, గరిగంటి మహిపాల్, మహేష్, గ్రామ మాజీ సర్పంచ్ గరిగంటి మల్లేశం, ముదిరాజు సంఘం సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం

● బొప్పాపూర్‌కు చెందిన మహిళ మృతి ● భర్తకు తీవ్ర గాయాలు


నీతిరెడ్డి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన మహిళ నీతిరెడ్డి(40) అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. భర్త సురేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని బొప్పాపూర్‌కు చెందిన సురేశ్ తన భార్యాపిల్లలతో కలిసి ఇటీవల హైదరాబాద్‌లో స్థిర పడ్డారు. భార్య నీతిరెడ్డి, కూతురు సమీక్ష ఉన్నారు. సురేశ్, దీప్తి దంపతులు తమ కూతురు సమీక్షను ఇంటి వద్ద ఉంచి నిర్మల్ జిల్లాలోని బంధువుల ఇంటిలో జరిగే శుభకార్యానికి కారులో బయలుదేరారు. డిచ్‌పల్లి సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడడంతో నీతిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందింది.భర్త సురేశ్ తీవ్ర గాయాలతో బయట పడ్డాడు. నీతిరెడ్డి ప్రమాదంలో మృతిచెండంతో గ్రామంలో విషాదం నెలకొంది.

సౌదీ ప్రమాదంలో ఒకరి మృతి

స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం


మహమ్మద్ నబీ(ఫైల్)

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 27: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ నబీ(53)సౌదీ అరేబియాలో ప్రమాదవశాత్తూ మృతిచెందగా మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరింది. నబీ గత కొన్ని రోజుల క్రితం సౌదీ అరేబియాలో ప్రమాద ఘటనలో మృతి చెందంగా గల్ఫ్ అవగాహన వేదిక చొరవతో మృతదేహం మాదాపూర్ గ్రామానికి చేరుకుంది. నబీ ఉపాధి కోసం కొన్ని సంవత్సరాల క్రితం గల్ఫ్‌కు వెళ్లాడు. గత నెల 30వ తేదీన నబీ పనిచేస్తున్న కంపనీలో ప్రమాదవశాత్తు గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతదేహం స్వగ్రామం రప్పించడానికి నబీ తమ్ముడు మహమ్మద్ జావిద్ గల్ఫ్ కార్మిక అవగాహన సభ్యులైన ఫరూకు, అబ్బుల్ రఫీక్‌లను సంప్రదించడంతో వారు ఇండియన్, సౌదీ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మృతదేహం స్వగ్రామానికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. కాగా నబీకి భార్య సరీఫాతోపాటు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

క్రీడా ప్రాంగణంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 17: ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనువైన ప్రదేశంలో స్థలాలు లేకపోవడంతో క్రీడా ప్రాంగణంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఆడుకునేందుకు యువకులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరు తున్నారు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాల నిర్వహణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.



సుద్దాలలో క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం

ధాన్యం కుప్పలపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

● మాజీ సర్పంచ్‌కు గాయాలు

చందుర్తి ఏప్రిల్ 28: రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలపైకి ఓ ట్రాక్టర్ దూసుకెళ్లి బోల్తా పడడంతో డ్రైవింగ్ చేస్తున్న మాజీ సర్పంచ్‌కు తీవ్ర గాయాలైన సంఘటన చందుర్తి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. చందుర్తి మండల కేంద్రంకు చెందిన మాజీ సర్పంచ్ మర్రి మల్లేశం చందుర్తి నుంచి ట్రాక్టర్‌పై మోత్కురావుపేటకు వెళుతుండగా చందుర్తి శివారులోని రైతు వేదిక వద్ద రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పల పైకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న మల్లేశంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మల్లేశంను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరుగుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ టోర్నమెంట్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసోసియేషన్ బాధ్యులు


ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 28: గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. మెదక్, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన పోటీలో కరీంనగర్ జట్టు విజయం సాధించగా, ఆదిలాబాద్ నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీ డ్రాగా ముగిసింది. ఖమ్మం, ఆదిలాబాద్ జట్ల మధ్య జరిగిన పోటీలో ఆదిలాబాద్ జట్టు విజయం సాధించింది. వనపర్తి, మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరిగిన పోటీ డ్రాగా ముగిసింది.

నిజామాబాద్, కరీంనగర్ మధ్య జరిగిన పోటీల్లో కరీంనగర్ జట్టు విజయం విజయం సాధించింది. టోర్నమెంట్ కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి, వైస్ ప్రెసిడెంట్ నాయుడు, కోశాధికారి సామల సత్యానారాయణ, జాయింట్ సెక్రటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్‌తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


బుర్ర రాజమ్మ(ఫైల్)

ఎలిగేడు, ఏప్రిల్ 28: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బుర్ర రాజమ్మ(108) ఆదివారం మృతి చెందారు. ఆమె భర్త బుర్ర లస్మయ్య 35ఏళ్ల క్రితం మృతిచెందాడు. రాజమ్మకు చనిపోయే వరకు షుగర్, బీపీ ఇతరత్రా వ్యాధులు లేకుండా ఆరోగ్యంగా ఉన్నారు. ఆదివారం చనిపోగా గ్రామస్థులు తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించారు.

క్రేన్ బావిలో పడి కూలీ మృతి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 28: బావిలో పూడిక తీత పనుల్లో ప్రమాదవశాత్తు క్రేన్ బావిలో పడడంతో ఓ కూలీ మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామంలో ఆదివారం ఘటన చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ మారుతి కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన అంజయ్య అనే రైతు తన వ్యవసాయబావిలో పూడిక తీత కోసం మండలంలోని ఫాజుల్‌నగర్‌కు చెందిన దండుగుల కొమురయ్యకు కాంట్రాక్టు ఇచ్చాడు. ఆదివారం యాదావిధిగా బావిలో నుంచి మట్టి తీసే క్రమంలో బావి పక్కనే ఉన్న క్రేన్‌తో పాటు క్రేన్ నడుపుతున్న దండుగుల మల్లవ్వ(70), దేవయ్యలు బావిలో పడిపోయారు. మల్లవ్వకు తీవ్ర గాయాలు కాగా అక్కడే మృతి చెందింది. దేవయ్యకు స్వల్ప గాయాలు కాగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. కుమారుడు కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ మారుతి పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన మల్లవ్వ మృతదేహంను తీసేందుకు పోలీసులు ప్రత్యేకంగా క్రేన్ ఏర్పాటు చేసి బావిలో నుంచి మృతదేహంను బయటకు తీశారు. క్రేన్‌తో పాటు మల్లవ్వ బావిలో పడే సమయంలో బావిలో కొమురయ్య, గంగమణి ఉన్నట్లు బాధితులు తెలిపారు. మల్లవ్వ కుమారుడు, కోడలు కలిసి బావిలు గుత్తకు పట్టుకుని జీవిస్తుంటారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహంను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నేడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

రామగిరి, ఏప్రిల్ 28: మండలం కేంద్రంలోని సత్య ఏసీ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి మండలాలకు చెందిన ముఖ్యకార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తొట చంద్రయ్య, కల్వచర్ల గ్రామశాఖ అధ్యక్షుడు కొలిపాక సారయ్య ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో శ్రీపాద ట్రస్టచైర్మన్ దుద్ధిళ్ల శ్రీనుబాబు హజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తలు హజరు కావలని పిలుపు నిచ్చారు.

దళితుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి

మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్

కాల్వ శ్రీరాంపూర్, ఏప్రిల్ 28: దళితుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీనే కృషి చేసిందని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తారని, పార్లమెంటు ఎలక్షన్ పెద్దపల్లి పార్లమెంట్ పరిధితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దళితులకు ఇచ్చిన భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం బలవంతంగా తీసుకొని పల్లె ప్రకృతి, శ్మశాన వాటికలు నిర్మించిన బీఆర్‌ఎస్ పార్టీకి దళితుల శాపం తగిలిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దళిత బంధు పేరుతో కాలయాపన చేసి దళితులను మోసం చేసిందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యాపార రంగాలను అంబానీ అదానీలకు అప్పగించి ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. వెనుకబడిన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ కల్పిస్తే మోదీ ప్రభుత్వం వాటిని రద్దు చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే బడుగు బలహీన వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీటీసీ రావి సదానందం, కాంగ్రెస్ నాయకులు అక్కుర్ సురేందర్, మాదాసి సతీష్, కొంతం మధుకర్, గీస రాజయ్య, బంగారి రమేష్, ఐలయ్య పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



రైతులతో మాట్లాడుతున్న చందర్

పాలకుర్తి, ఏప్రిల్ 28: రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు.ఆదివారం మండలం పరిధిలోని గుడిపెల్లి, జయ్యారం గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత అసెంబ్లీ ఎన్నికల్లో రైతులను మాయమాటలతో మభ్యపెట్టి కల్ల బొల్లి మాటలు చెప్పి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ తిరిగి పార్లమెంటు ఎన్నికల్లో సైతం అదే మాట మాట్లాడుతున్నారన్నారు. రైతులు గమనించి కాంగ్రెస్ పార్టీ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. రైతులను ఆదుకోవడానికి వరికి బోనస్, రైతు భరోసా అమలు, రుణమాఫీ వంటి చర్యలను వెంటనే చేపట్టాలని తెలిపారు. పంట నష్టాలన్నీ అంచనా వేసి రైతులకు ఎకరానికి రూ.25 వేల పరిహారం ఇవ్వాలని అన్ని పంటలకు రూ.500 రూపాయల బోనస్‌తో కొనుగోళ్లు చేయాలన్నారు. సబ్బండ వర్గాల ప్రజలకు న్యాయం జరగాలం టే రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణదాసు మారుతి, నీరటి శ్రీనివాస్, ఇంజపురి నవీన్ కుమార్, రావుల పున్నం సాగర్, కొప్పు రాజేశం, చింతకింది సత్యనారాయణ, గాజుల ప్రసాద్ గౌడ్, రేశవేణి మల్లేశం, మామిడాల గట్టయ్య పాల్గొన్నారు.

నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేయడమే లక్ష్యం

కళ్యాణ్‌నగర్/సుల్తానాబాద్/రామగిరి, ఏప్రిల్ 28: నరేంద్ర మోదీని మూడోసారి గెలిపించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ మహిళా మోర్చ ఇన్‌చార్జి సోమారపు లావణ్య అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా లక్ష్మీనగర్, శివాజీనగర్, మెయిన్ చౌరస్తాలో బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలంటూ గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో గోమాస శ్రీనివాస్ సతీమణి గీత, బల్మూరి వనిత, మూకిరి రాజు, గాండ్ల స్వరూప, ప్రసన్న, బండారు లక్ష్మి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరచాలని, బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు మండలంలోని గర్రెపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెట్టి శ్రీనివాస్, వడ్లకొండ మహేష్ గౌడ్, కుందేళ్ల సతీష్, పులి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. రామగిరి మండలంలోని సెంటినరీకాలనీలో బీజేపీ శ్రేణులు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మోల్మామూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలకు ఓట్లడిగే అర్హత లేదు

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, ఏప్రిల్ 28 : రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలకు ఓ ట్లడిగే అర్హత లేదని, ఇందిరమ్మ రాజ్యం కోసం కేంద్రంలో కాం గ్రెస్ పార్టీకి తిరిగి పట్టం కట్టాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిలతో కలిసి ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఆదివారం పెగడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడ లిలో ఎన్నికల ప్రచార కార్నర్ మీటింగ్‌లో పా ల్గొన్నారు. అం తకుముందు పార్టీ శ్రేణులు, అభిమానులు పోలీస్‌స్టేషన్ కూ డలి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు డప్పు చప్పుళ్లతో స్వాగ తం పలికి ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పేదల పెన్నిదిగా పేరున్న కాక మనుమడిగా గడ్డం వంశీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు రాములుగౌడ్, ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీ నర్ స్వామి, జడ్పీటీసీ రాజేందర్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా.. మహాలక్ష్మి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ధర్మపురి, ఏప్రిల్ 28: మహాలక్ష్మి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ మహాలక్ష్మి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అర్చకులు కొరిడె బాలకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో పలు వీధుల్లో రథాన్ని ఊ రేగించారు. పెద్ద ఎత్తున మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు. అంతకు ముందు ధర్మపురి ఆలయం పక్కన గోదావరి నది వద్ద గల దేవ స్థానమునకు ముత్యాల తలంబ్రాలు, ప ట్టువస్త్రాలు ప్రతి సంవత్సరము వలె ఈ యేడాది కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, వేదపండితులు ముత్యాల శర్మ, నంబి నరసింహమూర్తి, కల్యాణ్, జూనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి, అభిషేక్ పురోహితులు రాజగోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం







పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా గురువులతో కలిసి ఉన్న పెద్దపల్లిలోని సిద్దార్థ పాఠశాల, గోదావరిఖనిలోని సింగరేణి హైస్కూల్, రాజరాజేశ్వర హైస్కూల్ విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 28: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ సెకండరీ స్కూల్‌లో 2002-03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పెద్దకల్వలలోని మహబూబ్ గార్డెన్‌లో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి వారి దీవెనలు పొందారు. అకాల మరణం చెందిన తమతో కలిసి చదువుకున్న పలువురు విద్యార్థులు, గురువులను స్మరించుకుని ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 21 సంవత్సరాలు వెనకకు వెళ్లి ఆట,పాటలతో ఆనందంగా రోజంతా గడిపారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు సంధ్య, సురేంద్ర ప్రసాద్, రవీందర్, సదానందం, గట్టయ్య, రాజేంద్రప్రసాద్, ప్రవీణ్, పూర్వ విద్యార్థులు ఈరమల్ల రమేష్, జాపతి సంజీవ్, రాజేందర్, సతీష్, శ్రవణ్, సంధ్య, భారతి, మరో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: గోదావరిఖనిలోని సింగరేణి హైస్కూల్ సెక్టార్-2 పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు 41 ఏళ్లకు ఆదివారం కలుసుకున్నారు. 1983 సంవత్సరానికి చెందిన 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనందంగా ఆడారు పాడారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు, వ్యాపార రంగాల్లో పనిచేస్తున్నారు. కార్యక్రమంలో బొల్లం మధు, శ్యాంకుమార్, ఆవుల సుధాకర్, వేణుగోపాల్, కుమారస్వామి, సత్యగోపాల్, రవి, రవికుమార్, మంజుల, సుధామయి, దుర్గారత్నం, ఉపాధ్యాయురాలు ఉషారాణి పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: గోదావరిఖనిలోని జవహర్‌నగర్‌లోని రాజరాజేశ్వర హైస్కూల్‌లో 28 సంవత్సరాల క్రితం పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ప్రైవేట్ ఫంక్షన్ హాల్ నిర్వహించారు. 1995-96 సంవత్సరం పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకే చోట కలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనందంగా డాన్సులు చేశారు. కష్టసుఖాలను పంచుకున్నారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీజేపీ నాయకుడి మృతి

సుల్తానాబాద్, ఏప్రిల్ 28: బీజేపీ జిల్లా నాయకుడు ఆది కేశవరావు (50) గుండెపోటుతో మృతి చెందారు. రామగుండం ఓబీసీ నేతల మీటింగ్‌లో పాల్గొని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కమిటీ సభ్యుడు గుజ్జుల రామక్రిష్ణారెడ్డితో కలసి కారులో తిరిగి కరీంనగర్ వస్తుండగా సుల్తానాబాద్ చెరువు వద్దకు రాగానే అస్వస్థకు గురయ్యాడు. చాతిలో నొప్పితో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండడంతో వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నడుచుకుంటే వెళ్లిన కేశవరావు బెడ్‌పై పడుకునే యత్నంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడని దాంతో వెంటనే సీపీఆర్ చేసినా లాభం లేకుండా పోయిందని డాక్టర్లు తెలిపారు. అయినా అతన్ని అంబులెన్సులో కరీంనగర్ అస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. కేశవరావు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు పదవులు నిర్వహించారు.

'కొప్పుల'కు దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి మద్దతు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 28: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కొప్పుల ఈశ్వర్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటించినట్టు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు చిలుక ప్రసాద్ చెప్పారు. ఆదివారం గోదావరిఖని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దళితులను ఎదగకుండా అణగదొక్కుతున్నారని, కాంగ్రెస్ పార్టీ గడ్డం వంశీని అభ్యర్థిగా ప్రకటించడం ఈ ప్రాంత వాసులకు అన్యాయం చేసినట్టేనన్నారు. ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసిన కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో కనుకుంట్ల రమేష్, రొడ్డ సంపత్, శ్రీహరి, తిరుపతి, రాంబాబు, వేణు, తిరుపతి, రఘు, అన్వేష్, ప్రశాంత్, సురేష్, మాతంగి శివ తదితరులు పాల్గొన్నారు.

శీతల పానియాల పంపిణీ

జూలపల్లి, ఏప్రిల్ 28. మండలంలోని వడుకాపూర్‌లో శీతప పానియాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన క్రిస్టియన్ మతస్తుడు కన్నం నర్సయ్య అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామంలోని చర్చిలో ఆదివారం మృతుడి జ్ఞాపకార్థం అదే గ్రామానికి చెందిన విద్యాకమిటీ మాజీ చైర్మన్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు క్రిష్టియన్ మతస్థులకు చల్లని పానియాలను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ ఎంతో నిబద్ధత, భక్థిబావం కలిగిన ఉన్న, కన్నం నర్సయ్య మృతి చెందడం కుటుంబసభ్యులకు, తీరని లోటన్నారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్, కన్నం లింగయ్య, కరికిరెడ్డి కొమురయ్య, మాంకాలి కిష్టయ్య పాల్గొన్నారు.

రామగుండంలో భానుడు భగభగ

- 44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు - జన సంచారం లేక వెలవెలబోతున్న వ్యాపార కేంద్రాలు





మధ్యాహ్నం నిర్మానుశ్యంగా మారిన బస్టాండ్ చౌరస్తా రాజీవ్ రహదారి, తలకు రుమాలు చుట్టుకుని వెళుతున్న వాహనదారులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 28: భానుడు భగభగమంటున్నాడు... ఉదయం ఏడు గంటలకే ఎండలు దారెత్తిస్తున్నాయి. పది రోజులుగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఓసీపీలలో మరో రెండు డిగ్రీలు అత్యధికంగా నమోదు అవుతున్నాయి. మధ్యాహ్నం 12గంటలకే రోడ్లపై జన సంచారం లేక వెలవెలబోతున్నాయి. వ్యాపార కేంద్రాల్లో కొనుగోలుదారులు రాక వ్యాపార, వాణిజ్య కేంద్రాలు బోసిపోతున్నాయి. మధ్యాహ్నం 12గంటలు దాటితే రోడ్లపైకి రావాలంటే జనం జంకుతున్నారు. రాత్రి ఎనిమిది గంటలు అయినా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. వేడిగాలులు వీస్తున్నాయి. మధ్యాహ్నం వడ గాలులతో జనం బేజారవుతున్నారు. పది రోజుల క్రితం కొంత వాతావరణం చల్లబడినప్పటికీ వారం రోజులు ఎండలు పెరిగిపోయాయి. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో జేబురుమాళ్లు, టోపీలు ధరించి బయటకు వస్తున్నారు. ఓసీపీల్లో రెండో షిఫ్టు హాజరు శాతం తగ్గింది. పని వేళలను మార్చాలంటూ కార్మిక సంఘాలు యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, కార్మికుల పని వేళలు మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.



నిర్మానుశ్యంగా మారిన లక్ష్మీనగర్ వ్యాపార కూడలిలోని రోడ్డు

జగమంత కుటుంబం నాదీ..

సుల్తానాబాద్, ఏప్రిల్ 28: నానమ్మ, అమ్మమ్మలంటేనే తెలియని తరమిదీ. ఉమ్మడి కుటుంబాల ఊసు లేని జీవితాలు.. సర్వ స్వతంత్ర జీవన పయనంలో ఎవరికీ ఎవరు ఏమౌతారో తెలియని పట్టించుకోని మనుషులున్న సమాజంలో ఓ కుటుంబం వారు తమ వారందరినీ ఒక చోట చేరి తమ పరివారానికందరికీ వారిని పరిచయం చేశారు. నాటి ఉమ్మడి కుటుంబాల అనురాగాల ఆప్యాయతల ప్రేమల గురించి అన్యోన్యతలను నేటితరాల వారికి తెలియజెప్పారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన అల్లెంకి వంశస్థులు అల్లెంకి బుచ్చమ్మ శివయ దంపతుల వంశవృక్షానికి చెందిన వారందరినీ ఒక చోట చేర్చారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అల్లెంకి వంశస్థుల ఐదు తరాలకు చెందిన వారు దాదాపు మూడు వందలకు పైగా పాల్గొన్నారు. ఒక్కొక్క కుటుంబాన్ని పరిచయం చేసుకుని బాగోగులను తెలుసుకుని వారి బంధుత్వాన్ని తమతమ పిల్లలకు పరిచయం చేసుకుని ఉల్లాసంగా గడిపారు. కాగా అల్లెంకి వారి కుటుంబం ద్వారా అంకురించిన కొమురవెల్లి కిష్టాబాయి వారి వంద మంది కుటుంబ సభ్యులు ఈ వేదికలో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. సమావేశానికి పల్లా మురళి సదాలక్ష్మి, కంజర్ల వెంకన్న, ముస్త్యాల రాజన్న, పల్లా కిషన్, అల్లెంకి అశోక్, అల్లెంకి శ్రీనివాస్ లావణ్య, కరుణాకర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.



ఒక చోట చేరిన కుటుంబ సభ్యులు

ఘనంగా ఉత్సవమూర్తుల ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం

కోరుట్ల, ఏప్రిల్ 27: పట్టణంలోని సాయి రాంపుర కాలనీలోని భక్త అంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం సీతారామచంద్ర, పంచముఖ అంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్యాక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఆలయ అర్చకులు బ్రహ్మణగారి శంకర్ శర్మ మంత్రోచ్చరణ మధ్య ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపి ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తుల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యవచనం, గౌరి, గణపతి పూజలను నిర్వహించి స్థాపిత దేవత హోమం జరిపారు. దేవాలయ నిర్వహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు పాల్గొన్ని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అలయ కమిటి సభ్యులు దురిశెట్టి సత్యనారాయణ, ప్రశాంత్, కిరణ్, కుంచె కుమార్ స్వామి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాపాడుకోవాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య - కార్యకర్తలకు శిక్షణ తరగతులు





మాట్లాడుతున్న సీతారామయ్య, హాజరైన ఏఐటీయూసీ కార్యకర్తలు

గోదావరిఖని, ఏప్రిల్ 28: కార్మికుల చట్టాలను కాపాడుతూ హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఇల్లందు క్లబ్‌లో నిర్వహించిన శిక్షణ తరగతులకు వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనేక దశాబ్దాలు కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న హక్కులను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, పని గంటలు పెంచేందుకు కుట్రలు చేస్తుందని వారు ఆరోపించారు. కార్మికుల హక్కుల సాధన కోసం, సాధించుకున్న హక్కులను పరిరక్షించేందుకు, యాజమాన్యంతో ఎలా వ్యవహరించాలి అనే అంశాలను వివరించారు. కార్మిక చట్టాలను కోడ్‌లుగా విభజించడం వల్ల దీని ప్రభావం తీవ్రమవుతుందని, దీనిని తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. సంస్థలో పాతతరం కార్మికులు పదవీవిరమణ పొందారని, తరువాత నూతనంగా యువ కార్మికులు ఉద్యోగాలు చేస్తున్నారని, వారికి కార్మిక చట్టాలపై అవగాహన లేదని, వారికి అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. సింగరేణి మనుగడ కోసం కృషిచేయాలని, పదవీవిరమణ పొందిన రిటైర్డ్ కార్మికులకు బెనిఫిట్స్, మైన్స్ రూల్స్, స్టాండింగ్ ఆర్డర్స్‌పై అవగాహన కల్పించారు. 135ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణిలో అనేక సంస్కరణలు వచ్చాయని, బొగ్గు ఉత్పత్తి 72మిలియన్ టన్నులకు పెరిగిందని, సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్, సింగరేణి రిటైర్డ్ డీజీఎం శ్యాంసుందర్‌రెడ్డి, వైద్యులు సుమన్, యాస శ్రీనివాస్, సాబీర్‌పాషా, మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, మాదన మహేష్, బోగి సతీష్‌బాబు, సంకె అశోక్‌తో పాటు వివిధ విభాగాల్లో పని చేస్తున్న పిట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

కొత్త గనులు ప్రారంభించాలి : బీఎంఎస్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 28: సింగరేణిలో కొత్తగనులు ప్రారంభించి యువతకు ఉపాధి కల్పించాలని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు కొత్తకాప లక్ష్మారెడ్డి అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సింగరేణి కోల్‌మైన్స్ కార్మికసంఘ్ (బీఎంఎస్) కేంద్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సాధించే వాస్తవ లాభాలపై 40 శాతం వాటా ఇవ్వాలన్నారు. పెర్క్స్‌పై ఆదాయపన్ను మాఫీ, సొంతింటి కల, మెరుగైన వైద్యం, విద్య అందించేందుకు యాజమాన్యం కృషిచేయా లన్నారు. అనంతరం పలు యూనియన్లకు చెందిన నాయకులు బీఎంఎస్‌లో చేరారు. బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు పి మాధవనాయక్, టిఎస్ పవన్‌కుమార్, మంద రవకాంత్, పి వేణుగోపాల్‌రావు, శ్రీనివాసరాజు, వై సారంగపాణి, పెండ్లి మోహన్ రెడ్డి, నాతాడి శ్రీధర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, చెట్టు వీరన్న పాల్గొన్నారు.



ఓసీపీ-3 సీహెచ్‌పీలో రక్షణపై నిర్లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 28: ఓసీపీ-3 సీహెచ్‌పీలో రక్షణను విస్మరించి కేవలం బొగ్గు రవాణాకే యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. రక్షణ చర్యలు లేకున్నా కార్మికులతో అధికారులు పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెయిన్ బంకర్స్‌లో రెండో బంకర్‌కు ఆర్‌సీసీ పగిలి రంధ్రం ఏర్పడింది. దాని నుంచి బొగ్గ పెల్లలు కింద పడి అక్కడ పనిచేస్తున్న కార్మికులు గాయాలబారిన పడుతున్నా యాజమాన్యం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. బొగ్గు పెల్లలు పడి పలువురు కార్మికులు గాయాలపాలైనా యాజమాన్యం స్పందించలేదని కార్మికులు వాపోతున్నారు. ఇటీవల ఫ్లోఫీడర్ నుంచి జారిపడి మరొక కార్మికుడు గాయపడ్డాడు. కాగా యాజమాన్యం రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో జరుగుతున్న ప్రమాదాలను దాచేలా గాయపడిన కార్మికులను సింగరేణి ఆసుపత్రికి కాకుండా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించు కునేలా ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. మూడు నెలలుగా ఫ్లో ఫీడర్‌లో నీళ్లు నిండి బొగ్గు పెళ్లలతో కార్మికులు నడవలేని పరిస్థితి ఉన్నా అధికారులు శుభ్రం చేయడంపై దృష్టి పెట్టడం లేదు. అదే ఫ్లో ఫీడర్‌లో వాటర్ సంపు పూర్తిగా మట్టితో నిండినా, మట్టిని తీయక నీళ్ళు నిల్వ ఉంటున్నాయి. రక్షణ చర్యలే కాకుండా యాక్టింగ్‌లు ఇవ్వడంలో పక్షపాత ధోరణిని సీహెచ్‌పీ అధికారులు అవలంబిస్తున్నట్టు కార్మికులు ఆరోపిస్తున్నారు. సీనియర్ కార్మికులకు యాక్టింగ్ ఇవ్వాల్సి ఉండగా జూనియర్లకు ఇస్తున్నారని, పైరవీలకు ప్రాధన్యం ఇచ్చి యాక్టింగ్‌లు ఇస్తుండడంతో సీనియర్ కార్మికులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. గెలిచిన రెండు సంఘాలు సీహెచ్‌పీ సమస్యలను పట్టించుకోవడం లేదని కార్మికులు అంసతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడిగా అశోక్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 28: సింగరేణి కోల్‌మైన్స్ కార్మికసంఘ్(బీఎంఎస్) కేంద్ర ఉపాధ్యక్షుడిగా చాట్ల అశోక్ నియమితులయ్యారు. ఆదివారం నస్పూర్‌లో జరిగిన సమావేశంలో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని, యూనియన్ అభివృద్ధికి పాటుపడతానన్నారు. తనకు అవకాశం కల్పించిన బీఎంఎస్ బొగ్గుగనుల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు కొత్తకాప లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



చాట్ల అశోక్